ఎవరు, ఏమిటి, ఎందుకు ?

అనిశెట్టి అప్పారావు

ఇవాళైతే ఈ బొంబాయిలో మనిషి ఒరుగై ఒగుడాకై మెలికలు తిరిగిపోతున్నాడు గాని అసలుకి ధర్మారావు పుట్టిన స్థళం గన్నవరం. చెడ్డీలు తొడుక్కోడం తెలీని రోజుల్లోంచి పల్లెమీదుగా చెట్ల చిటారు కొమ్మల్ని ఒరుసుకుని ఎగిరిపోయే విమానాల్ని తనలో సృష్టించుకుంటూనే పెంచుతూనే ప్రపంచం ఇంచుమించూ తెలియక పర్యవసానం ఎరుగక లేడిపిల్లలా పాలబుద్దిలా తనూ పెరుగుతూనే ధర్మారావు విమానాలంతటి ఊహల్ని తనలో చిత్రించుకోడం జరిగింది.

ధర్మారావు కుర్రతనం గనక తను పట్టిన కుందేటికి మూడేకాళ్ళనుకున్నాడు. అలా అనుకుని తృప్తిపడితే ఎంతో బావుండేది. అది తను మెట్రిక్ ప్యాసైనప్పటి మాట. అలా అనుకుని ప్లీడరు సుబ్బారావు దగ్గిర గుమాస్తాగా కుదురుకుని ఉంటే ఎంతో బావుండేది. ఒకళ్ళ సలహా పాటించలేదు. ఒకళ్ళ ప్రాపు ఆశ్రయించలేదు ! అసలుకి కుర్రాడు తను. అనుభవం చాలని వయస్సు. అంతేగాని ప్రపంచం వేపు ఒక్కసారి కన్నెత్తి చూళ్ళేదు. దాని గమనాన్ని, వక్రమార్గాల్ని, ఒక్కో మనిషి ఎన్నేసి ముఖాలు తగిలించుకుని ఎందుకైతే ఒకరితో సంబంధాలు లేక మంచితనం లేక ఎందుకైతే ఇలా తిరుగాడుతున్నాడో ఇలా యాతన పడుతున్నాడో తను పరికించలేదు. ఒక్కో సమస్యకి ఎన్నేసి ముఖాలైతే వున్నాయో తను పరిశీలించలేదు. కావడంవల్ల కాలేజీలో చేరాడు. కావడంవల్ల తన స్థితిగతులు ఆలోచించలేదు. కావడం వల్ల అప్పులు చెయ్యడం, ఉన్న నాలుగెకరాల ముప్పాతికా పొలం తాకట్టు పెట్టడం, చివరికి అమ్మడం జరిగింది. ముచ్చటైన ప్లీడరీ గుమాస్తాని, కంచంలో అన్నాన్ని కాళ్ళతో తన్నుకోడం జరిగింది.

ఐతే మొదట్లో తను చేసింది పెద్ద తప్పుగా అవుపించలేదతనికి. ఒకటి రెండురోజులు పస్తులు వుండి కాలేజి మానివేసి పార్కులో చెట్టుకింద నీడలో పడుకున్నప్పుడు అతనికి ఇవే ఆలోచనలు వచ్చేవి. తను కాలేజీలో చేరడమే పెద్ద పొరపాటనిపించేది. కళ్ళు చెమ్మగిలేవి. ఐతే చివరిరోజులు కావడం వల్ల చదువు పూర్తిచేయకుండా కాలేజీ వదిలేస్తే అంతా వృథా అవుతుందని ఇంకా కాంక్ష ఎక్కడో మనస్సులో మారుమూలల పెనుగులాడేది. కణతలు నొప్పి పుట్టేవి. ఆలోచించడం మానివేసేవాడు. నిజానికి అసలు ఆలోచించి మానివేసి ఎన్నిరోజులయింది. తనలో తను తెలిమబ్బు కాంతిలా నవ్వుకునేవాడు. దగ్గర దమ్మిడీకూడా లేని సమయాల్లో నవ్వు పుట్టిన సమయాల్లో స్వచ్ఛమైన తెల్లటి పాలపొంగులాంటి నిరంతరానందమయమైన నవ్వు తళుక్కున మెరిసే క్షణం అది. జీవితంలోని యదార్థ సంఘటనల్ని చూసి బెదిరిపోయేవాడు. నెమ్మదిగా

రోజులు జరిగిన మీదట తనని తను సంబాళించుకోవడం జరుగుతున్నది. తనని తను తల్లిలా ఓదార్చుకోడం జరుగుతున్నది.

నిజానికి తను పెద్దపెద్ద ఆశలకి పోలేదు. అతి సామాన్యుడు కోరే జీవితం తప్ప తను ఎక్కువేమీ కోరడం లేదు. పరువుగా మర్యాదగా తనకు తానై స్వతంత్రించి బ్రతకగలిగే శక్తి తనలో వుంది. తన దగ్గిర ప్రతిభ వుంది. తను అనుకున్న రీతిలో బ్రతకాలి తను. ఒకరి అండ మీద ఒకరి దయాదాక్షిణ్యాల మీద బ్రతకడం తనకి పడదు. అసహ్యం. ఐతే ప్రపంచానికి తను ఇవ్వగలిగిందాని కంటే ఎక్కువేమీ కోరడం లేదు తను. అసలు ఇలా కోరడంలో వున్న తప్పు ఏమిటో ఎప్పుడూ అర్థం కాదు తనకి. ఐతే ఇలా కాకుండా ఎందుకు జరుగుతున్నది. ఈ డబ్బనే వస్తువు ప్రతివాడికీ అందుబాటులో లేకుండా ఎందుకు జరుగుతున్నది.

తన జీవితాన్ని ముందుకు సాగనివ్వకుండా క్షణం క్షణం అడ్డుతున్నదెవరు ? ధర్మారావుకి అర్థం కాలేదు. అవి కొత్తగా దినపత్రిక చదవడం మొదలుపెట్టిన రోజులు. ప్రపంచం ఇంకా రమారమి అర్థంకాని రోజులు.

* * *

ఎలాగైతేనేం తనూ బి.ఏ. అనిపించుకున్నాడు. ఇంతటితో కష్టాలు గడిచి గట్టెక్కినట్టు కాదని ధర్మారావుకి తెలుసు. ఇంతటితో తను గమ్యం చేరినట్టు కాదు. ఎక్కడో ఎవరో తన శ్వాస బిగిస్తున్నారని ధర్మారావుకి తెలుసు.

ఇంక తను పుట్టి పెరిగిన ఊళ్ళో ఉండడానికి ఆస్కారం లేదు. ఇష్టం కూడా కలగదు. తన అవసరం ఎవరికీ లేదు. కప్పు కూలిన మట్టిమిద్దె తప్ప ఊళ్ళో ఇంక తనకి మిగిలిందేమీ లేదు. కష్టాలు పరంపరలుగా రావడం తప్ప తను ఎవరికోసం ఆ ఊళ్ళో ఉండాలో తనకి తెలిసి రావడం లేదు.

'విమానాలు నడపడం దేవుడెరుగు. ఉన్నచోటే వుండు. ఏదైనా చిన్న ఉద్యోగం చూసుకుని తాపీగా బ్రతికే మార్గం చూడు.'

మాటలు ధర్మారావు మీద విరుచుకు పడ్డాయి. మాటలు ఒట్టి ఊహలు గనక, ఊహించడం ప్రమాదకరం గనక రోడ్డు మీద నడుస్తున్న ధర్మారావు ఒక్క క్షణం జంకి ఠక్కున ఆగి వెనక్కి తిరిగి చూసుకున్నాడు. ఇలాంటి క్షణాలు ప్రతి ఒక్కడి జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు హటాత్తుగా ఒక్కసారి ఎదురవక మానవు. ఇన్నాళ్ళ నుండి తనని తను తన జీవితాన్ని తను మోసగించుకుంటున్నానేమో ననిపించింది ధర్మారావుకి. తలపెట్టిన ప్రయత్నాలు తలకి మించినవిగా అవుపించే సరికి, అలివిమాలినవిగా తెలివిమాలినవిగా అవుపించేసరికి ధర్మారావు ఒక్కసారి వెనుదిరిగి చూడడం తటస్థించింది.

తను కలలుగన్న భవిష్యత్తు ఎదురుచూపుల పాన్పులాంటిది.

తను ఇన్నాళ్ళ నుండీ శ్రమపడి చదివిందంతా వృథాయేమోననిపించింది. ఎందుకూ కొరగానిదేమోననిపించింది. భయంతో ఒళ్ళంతా కంపించసాగింది. ఇప్పుడనుకోని లాభం ఏముంది. ఇంతకీ పరిస్థితులు కారణం. ఏ ఊహలైతే ఒకప్పుడు తన జీవితంలో ఒక ప్రయోజనాన్ని సాధిస్తాయనుకున్నాడో ఇవాళ అవే కోర్కెలు తన జీవితాన్ని కంటకావృతం చేస్తాయని, అసలు

ప్రాణమే చావుబ్రతుకుల కవాటంలో హతమారిపోతుందని తను ఎప్పుడూ అనుకోలేదు. ఏదైనా ఇప్పుడనుకుని లాభం ఏముంది. ఇకనైనా జాగర్తపడడం మంచిది. ఉన్న పొలం కాస్తా అమ్మకం అయిన మీదట, దీపం ఆరిపోయిన మీదట, కంచంలో పాలు ఒలికిపోయిన మీదట, ఇకనైనా మెలుకువతో ఉండడం మంచిది. తనమీద తను ఒట్టు వేసుకుని చెబుతున్నాడు, తను ఇక ఎప్పుడూ అలాంటి పొరపాట్లు చెయ్యనని. తను చేసిందానికి నిజానికి తను తగడని !

ప్రాణాలు అరచేత పట్టుకుని ప్రతి ఆఫీసూ గాలించాడు. ప్రతి ఆఫీసరు చుట్టూ తిరిగాడు. ఐతే తనకి ఉద్యోగం రాలేదు మరి. నిజానికి తనకీ ఉద్యోగం వచ్చి వుండేదే. ఐతే తన దగ్గిర ఐదు వందల రూపాయలు ఎక్కడ వున్నాయి. ఎక్కణ్ణుంచి తెచ్చేట్టు, లేకపోతే తనకీ ఉద్యోగం దొరికేదే. తనూ గుమాస్తాగా బ్రతికి వుండేవాడే. గుండెనిండా గర్వంతో హుందాతో, కాళ్ళకి కొత్తజోడు తొడుక్కుని, మెరుస్తున్న సిగరెట్టు కాలుస్తూ - బిళ్ళాబంట్రోతు దారి చేస్తుంటే, తన ప్రక్కప్రక్కన తనకి దారిఇస్తూ ఒత్తిగిలి అతి వినయంగా అవసరాల క్లయంటు తన ప్రక్కన నడుస్తుంటే - తనుగూడా తాసిల్దారులా గుమాస్తాగా గుర్రబ్బండిగా బ్రతికి ఉండేవాడే. అవును, నిజానికి తను గట్టి ప్రయత్నమే చేశాడు. ప్రమాణం చేసి చెబుతున్నాడు. ఐతే తను ఐదువందలు ఎక్కణ్ణుంచి తెచ్చేట్టు. అవును, తనకి తెలుసు. ఇక్కడ తనని పలకరించే వాళ్ళే లేరు. ప్రయత్నాలు చేసి చేసి విసుగెత్తి పోయింది జీవితం మీద. ఇల్లు అమ్మగా వచ్చిన డబ్బుకూడా అయిపోవచ్చే సూచనలు అవుపించేసరికి ధర్మారావుని ఎన్నడూ ఎరుగని భయం ఆవరించసాగింది. డబ్బులేని భయం, బ్రతకడానికి వీల్లేకుండా చేస్తున్న డబ్బులేని భయం !

తనకి తెలుస్తున్నది ఇవాళ.

ప్రపంచంలో వాస్తవాన్ని ఎదుర్కోవడం కంటే కష్టతరమైంది మరొకటి లేదని.

తను జీవితంలో ఇన్ని యాతనలు పడుతున్నప్పటికి తను జీవితాన్ని ఇంకా గాఢంగా ప్రేమిస్తున్నాడు. కష్టాల్లో పడి అగచాట్ల మధ్య, అపాయాల మధ్య చిక్కుకున్నప్పుడు ఇంకా తను జీవితాన్ని గాఢంగా ఇంకా ఇంకా గాఢతరంగా ప్రేమిస్తున్నాడు.

అయితే తను చెయ్యదల్చుకున్నవి చెయ్యనివ్వకుండా చేస్తున్నదెవరు ?

విలువలు చచ్చిపోయిన ప్రపంచంలో కూచుని ధర్మారావు ప్రశ్నిస్తున్నాడు.

2

"వాడు చూశావా బొంబాయి వెడుతున్నాడు!"

"ఎవడూ."

"వాడే, ధర్మారావు"

"ఎందుకూ. ఏరోడ్రోంలో చేరడానికేనా!"

"ఆఁ, అదే. అక్కడ వీడికోసం ఉద్యోగాలు ఎదురు చూస్తున్నట్లు. అయినా ఉన్నదాంట్లో ముడుక్కోక."

"మనవాడికన్నీ గొంతెమ్మ కోర్కెల్లే."

"బాగా చెప్పావు."

"ఐతే వస్తా."

"ఏం."

"ఇంట్లో పనుంది."

"ఔన్లే. ఐనా కాఫీకి నన్ను పిలుస్తావా"

"ఛ.ఛ. నిజంగా ఇంట్లో కాస్త పనుంది"

"నిజం ఇంటికనేది. హోటల్లోకి పోయేది, నాకూ తెలుసు."

"ఐతే వస్తే రా."

"నువ్వు పిలిస్తే రాకుండా వుంటానా"

"పద."

* * *

ఔను. ధర్మారావు బొంబాయి వెళ్ళిన మాట నిజమే. నవనాగరికుల మెప్పులు పుష్కలంగా పొందింది బొంబాయి. అది డబ్బున్న వాళ్ళ బొంబాయి. డబ్బున్న వాళ్ళకి దాని అందం చందం! ఇవన్నీ తెలిసే వెళ్ళాడు ధర్మారావు. ఉన్న ఊళ్ళో వుంటానికి తావులేక. అక్కడ తనకోసం ఎవరూ ఎదురు చూట్టంలేదు. ఏ ఉద్యోగాలు తనకోసం ఆగిలేవు. ఐతేనేం, వెళ్ళక తప్పింది కాదు. అసలు తను ఏదైనా విమానాశ్రయంలో చేరాలన్నా బొంబాయే వెళ్ళాలి మరి. ఐనా తనకోసం ఎవరో ఎక్కడో ఎదురు చూస్తారనుకోవడం కంటే తెలివితక్కువ మరొకటి లేదు. ధర్మారావుకి ఈ ప్రపంచం సంగతులు అన్నీ నెమ్మది మీద తెలుస్తూనే వున్నాయి. ఐతే తను రైలు ఎక్కేప్పుడు బాధతోనే వెళ్ళాడు. ఎవరో తనని బలవంతాన రైల్లో కూర్చోబెట్టినట్లనిపించింది. తనకి తెలుసు. ఇదంతా అంతగా తన మంచికేమీ రాలేదని. కాకపోతేనేం ! ఐనా ఇంక చేసేదేముంది. అందుకే ధర్మారావు ఒక పరిచయస్తుని సలహా మీద బొందిలో ప్రాణం వుండగా బొంబాయి వెళ్ళాడు.

రైల్లో ప్రయాణం చేసినన్నాళ్ళూ ట్రంకుపెట్టెని రెండు చేతుల్తో గట్టిగా పట్టుకునే వున్నాడు. నిద్రపోకుండా ఒకమూల కూచుని కునికిపాట్లు పడుతూ, పెట్టె బరువు ఎక్కువవుతున్న కొద్దీ వచ్చే నిద్రముంపు కాస్తా వదలిపోయేది.

జాగర్త సుమా అక్కడ పట్టపగలే ఖూనీలు జరుగుతాయి. చాలా జాగర్తగా వుండాలి నువ్వు. బొంబాయిలో 'చార్‌సౌ బీస్' ఎక్కువ. బొంబాయి చాలా గొప్పగా వుంటుందిలే! పదేపదే స్నేహితుని మాటలు చెవ్వుల్లో గింగురుమని తిరిగేవి.

మసక మసకగా తెల్లవారేసరికి రైలు తనని బొంబాయిలో దించింది. అంతేసి ఎత్తున గాలిలోకి లేచిన ఏడేసి అంతస్తుల మేడలు చూసేసరికి ధర్మారావు గుండె బావురుమన్నది. ఆ మేడలు ఇంతింత మురికి కొట్టుకుని, ఒక్కొక్క మేడలో వందలాది కుటుంబాలు కుక్క గొడుగుల్లా జీవించడం చూసేసరికి ధర్మారావుకి అసహ్యం వేసింది. ఒళ్ళు జలదరించింది. ఒక్కోగదిలో ఒక్కో కుటుంబం. భవనాల చుట్టూవున్న వేలాది కిటికీలు - ఒక్కో కిటికీ నుండి మకిల దుమ్ము కొట్టుకొని వ్రేలాడే ఆకులు పూలులేని బారెడు పూలమొక్క కాడలు. ఇది శిథిలమవుతున్న బొంబాయి నాగరికతకి సరైన చిహ్నం అనిపించింది ధర్మారావుకి. బొంబాయి నగరం గర్వపడే ఈ నాగరికతని చూసి, బెదిరి, ఒక్కసారి వెనక్కి తిరిగి రైలెక్కి పారిపోదామనిపించింది ధర్మారావుకి. కాని ఇంటిదగ్గర తనకోసం ఎదురు చూస్తున్నదెవరు! ఒకరి మీద ఒకరికి ఈర్ష్యా, అనుమానం, అసూయ, ద్వేషం తప్ప తన ఊళ్ళో మాత్రం ఎన్ని కుటుంబాలు సజావుగా, సాఫీగా బ్రతుకుతున్నాయి గనక. అంతకంటే

ఈ కృత్రిమ జీవితమే మేలు. ఇక్కడ నువ్వు ఏ కాల్వలోకో, ఏ రైలుకిందనో, ఏ రస్తా ప్రక్కనో పడి చనిపోయినా ఎవరని అనుకునే వాళ్ళుండరు. ఎవరేమిటని వచ్చి తొంగి చూసేవాళ్ళుండరు. ఒకరితో ఒకరు పలకరు. చూడరు. రంగులు వేసుకున్న ముఖాలు తప్ప, దుస్తుల విలువలు తప్ప, విలువైన కార్లు తప్ప, బొంబాయి మహానగరంలో ఒకరి ప్రమేయం మరొకరికి లేదు. ఎవరి బ్రతుకుతెరువు, ఎవరి మంచి చెడ్డలు, వాళ్ళు చూసుకోవడం తప్ప పక్కకి కన్నెత్తి చూడరు.

ఇక్కడ ఒకరూ నడవరు. పరిగెడతారు. అంతా కూడబలుక్కున్నట్లు, అంతా గడియారాల్లా ఆడామగా విచక్షణ లేకుండా, మరబొమ్మల్లా, ఐదునిమిషాల కొకసారి పట్నంలోకి వెళ్ళే మురికి రైలుకోసం అంతా పరిగెడతారు. ఇదంతా చూసి ధర్మారావు మొదట ఆశ్చర్యపోయాడు. కాలం అనేక రెట్లుగా తన వేగాన్ని గుణించుకున్న ఈ బొంబాయి నగరంలో ఇప్పుడు అంతా సహజంగానే అవుపిస్తున్నది. వేనకు వేలల్లో, లక్షలాది లక్షల్లో ఇప్పుడు అందరిలో తనూ ఒకడు. ధూళిలో, గాలిలో, రైలులో, గుంపులో ఇప్పుడు అందరిలో తనూ ఒకడు. తనూ పరిగెడతాడు. బాంద్రా నుంచి చావుని మోసుకువెడుతున్నట్లు దుర్వాసన దుర్గంధం చిమ్ముతూ పేదవాళ్ళ కొంపల్ని చుట్టుముడుతూ దశదిశలా వ్యాపించి మెలికలు తిరుగుతూ పోయే మురికినీళ్ళ పైపులు తప్ప, అంతా వస్తు సౌందర్యం తప్ప బొంబాయికి అందం ఏమిటి!

ఐతే నగరంలో ఏ ఇరానీ అంగడిలో పట్టినా అణా యిస్తే గుక్కెడు చాయ్ దొరుకుతుంది. ధర్మారావుకి చాలా గొప్ప వార్తే అది. కానీ బొంబాయి వెళ్ళిన మొదటి రోజే ఒక విషయం తెలియవచ్చింది తనకి. ఎలాంటి పరిస్థితుల్లోనైనా సరే - సబ్బు కొనుక్కొని తన బట్టలు తను ఉతుక్కోవడం తప్ప, ఏ షాపుకి వెయ్యకూడదని. ఆ డబ్బు పెడితే ధర్మారావు లాంటి వాళ్ళు ఒక రోజున గమ్మున బ్రతకవచ్చు!

ధర్మారావుకి బొంబాయి నగరం చీకటి గొయ్యిలా ఖైదుకొట్టులా అవుపించసాగింది.

అవును. తను నివసిస్తున్న గది ఖైదుకొట్టులాగే ఉంటుంది. తనతోపాటు మరో నలుగురు ఉంటున్నారు అంతచిన్న ఇరుకు సందులో. కప్పులోంచి రాలుతున్న మట్టి, కప్పుని కరుచుకుని నోళ్ళు తెరిచే పెద్దపెద్ద బల్లులు. అంతా ధర్మారావుని పద్మవ్యూహంలోకి లాగినట్టు, చిత్రహింసలు పెడుతున్నట్టు, నరనరాలు తోడుతున్నట్టు బాధ. జివ్వున లాగుతున్న కాళ్ళు, పాదాలు, చేతులు, రాయికి మల్లే మొద్దుబారిపోతున్నాయి.

ఇలా రోజుకి వారానికి ఎన్నిసార్లు జరగడం లేదు. ఇది పెద్ద విశేషం కాదు. కడుపులో బల్లలు పెరిగినట్టు, గట్టి పడిపోయి జీర్ణకోశం చెడిపోవడం ధర్మారావులాంటి వాళ్ళకి జరగడం అతిసామాన్యం. ఇది బొంబాయిలో పెద్దవిశేషం కాదు. ఐతే నాయర్ దగ్గర అన్ని మందులూ వున్నాయి. అన్నీ హోమ్యోవి. మరి ఇక్కడ డాక్టర్ల దగ్గరికి కనీసం పది రూపాయలు లేన్దినువు వెళ్ళలేవు. శీతజ్వరం కాసినా సరే. దానంతటదే పోవాల్సిందే తప్ప, లేకపోతే ఇక్కడ డాక్టర్లు నిన్ను దోచుకుంటారు. ఇది బొంబాయిలో అతి సామాన్యం.

మొదటి నెలకి ముందుగానే డబ్బు చెల్లించుకున్నాడు ధర్మారావు. కాళ్ళు చాచుకుని పడుకోడానిక్కూడా వీల్లేదు. ఇంత చిన్నచిన్న గదుల్ని తనెప్పుడూ చూళ్ళేదు. ఆ భవనంలో దాదాపు అరవై గదులున్నాయి. ఇలాంటి భవనాలు బొంబాయిలో వేలకు వేలున్నాయి. ఇలా నివసిస్తున్నవాళ్ళు లక్షలకి లక్షలున్నారు. ఇంత చిన్నచిన్న అరలుగా ఈ భవనాలు ఒకరు కట్టినట్టు కాకుండా ఏ రాత్రో

ఎవడో ఒక కిరాతకుడు వీటన్నిటినీ అమాంతంగా సృష్టించినట్టు, వాటిల్లో మనుషులుగా జీవించడానికి వీల్లేకుండా తనలాంటి వాళ్ళందర్నీ ఒక్కుమ్మడిగా బంధించినట్టు ధర్మారావు అనుకునేవాడు. అంతేగాని వీటన్నిటినీ రాళ్ళతో ఉక్కుతో అన్ని ఇళ్ళకి మోస్తరుగానే మనుషులే వీటిని నిర్మించారనే యదార్థం నమ్మకం ధర్మారావుకి పోయింది. మానవుడిలో నమ్మకం, తనలో తనకి నమ్మకం ధర్మారావుకి క్రమేణా తగ్గిపోసాగింది. నాయరు, లాలాజీ తప్ప ధర్మారావుకి ఆ గదిలో ఉన్నవాళ్ళెవరూ జీవితాన్ని సాఫీగా లాగుతున్నట్టు అవుపించదు. ఒకరూ అర్ధరాత్రి తప్ప ఎప్పుడూ గదికిరారు. పగలల్లా ఎక్కడ వుంటారో, ఏం పనులు చేస్తారో ఒకరికొకరికి తెలియదు. ఎవరి అవస్థలు వాళ్ళు ఒంటరిగా రహస్యంగా భరించడం తప్ప. ఒంటెల్లా జీవితాన్ని ఈడుస్తూ, లాడూబేడూ వేసుకుని బరువును మోస్తూ బ్రతకడం తప్ప ఒకరి విషయం మరొకరికి పట్టదు.

ధర్మారావుకి అవతలగా గోడకికాళ్ళు తన్ని బోర్లా పక్కకి కరుచుకుని పడుకున్న నాయర్ అర్ధరాత్రి లేచాడు. గోడకి కళ్ళు గుచ్చి, ఆలోచనా రహితంగా చూస్తూ పడుకున్న ధర్మారావుని తట్టిలేపాడు.

"మా కంపెనీలో ఏం జరిగిందో తెలుసా ?" అడిగాడు.

నాయర్‌కి విమానాశ్రయంలో పని. తను పని చేయాలనుకున్న విమానాశ్రయంలో ; తన ఆశలన్నీ తన కోర్కెలన్నీ పెట్టుకున్న విమానాశ్రయంలో.

గోడమీద ప్రాకుతున్న నల్లిని చంపకుండా దిగ్భ్రాంతిపడి చూస్తూ ధర్మారావు నాయర్ వైపు తిరిగాడు.

"మీ సమ్మె ఎంతవరకు వచ్చింది?" అడిగాడు.

"అరెస్టు చేశారు. నూటనలుగుర్ని"

"ఏం గలాటా చేశారా?"

"లేదు. ప్రభుత్వం కంపెనీని అత్యవసరశాఖ క్రింద ప్రకటించింది."

అత్యవసరశాఖ అంటే పనివాళ్ళ కాళ్ళూచేతులూ విరగ్గొట్టినట్టు, సమ్మె చెయ్యడానికి వీలుండదు.

అలాగనక చేస్తే పనివాళ్ళని పట్టుకు వెళ్ళి జైల్లో పెడతారు.

"ఐతే వర్కర్సు పనిలోకి వెళ్ళానికి ఒప్పుకుంటారా?"

నాయర్ మాట్లాడలేదు.

సమ్మెని విచ్ఛిన్నం చెయ్యడానికి యజమాన్లు యూనియన్ నాయకులకి ప్రమోషన్లు చూపారు. కానీ వర్కర్సు లొంగిరాలేదు. యజమాన్లు కాకుల్ని చంపి గద్దలకు వేసే పద్ధతులు అనేకం అవలంభించారు. కానీ వర్కర్సు లొంగిరాలేదు.

జరగడానికి వీల్లేని పరిస్థితుల్లో జరుగుతున్న విషయాల్ని చూసి ధర్మారావు విస్తుపోయాడు. తనకంటే తక్కువ చదువుకున్న నాయర్ ఉద్యోగస్థిరత్వాన్ని చూసి అప్పుడప్పుడు తను అసూయపడని క్షణాలు లేకపోలేదు. అయితే ఇవాళ నాయర్ తెచ్చిన వార్తని చూసి ధర్మారావు కంపించిపోయాడు. హటాత్తుగా నాయర్ని పనినుండి తొలగించింది కంపెనీ. ఒక్క నాయర్నే కాదు. యూనియన్ కార్యదర్శిని కూడా. మొత్తం నాలుగువందల ఎనభై మందిని. కారణం కంపెనీ నష్టం మీద నడుస్తుందని. మిగిలిన వర్కర్సు జీతంలో ఇరవై వంతులు కోతపెట్టింది కంపెనీ.

తనకి తెలుసు, నాయర్ ఒక్కడే కాదు. కొచ్చిన్‌లో మారుమూలల పల్లెలో తల్లీ ఇద్దరు చెల్లెళ్ళూ ప్రతినెలా నాయర్ పంపే మనియార్డరు కోసం ఎదురు చూస్తూంటారు. ఐతే ఈనెల నాయరు డబ్బు ఎలా పంపుతాడు ? ఇప్పుడు వాళ్ళగతేం కాను. ఇప్పుడు నాయర్ ఇక్కడ ఎలా వుండగలుగుతాడు ?

నాయర్‌కి ఈ పని తప్ప మరో పని తెలియదు. ఇక్కడ తప్ప మరొకచోట ఉద్యోగం దొరకదు. దేశం మొత్తం మీద విమానాలు నడిపే కంపెనీలు మూడు నాలుగేను. ఐతే ఇక్కడ పనిలోంచి తీసేశారు. ఇంకెక్కడ పని దొరికేట్టు. పని దొరక్కపోతే ఇంకెక్కడ ఎలా బ్రతికేట్టు!

"యూనియన్ సమ్మెచేయడానికే నిశ్చయించింది"

"ఇంకేం, మంచిదేగా"

"అవును, నువ్వు అలాగే అంటావు. చూడు. రేపీపాటికి కంపెనీ మూతవేస్తారు"

"మరి ప్రభుత్వం -"

"ప్రభుత్వం చాపకింద తేలులాంటిది"

"ఈ అత్యవసరాలన్నీ వర్కర్సుకి సంబంధించినంతవరకే"

"ప్చ్. మనరోజులు బాగా లేవు"

"నువ్వూ, నేనూ పనిచేయం అనడం లేదుగా"

"మరి వాళ్ళకి నష్టం వస్తుంటే"

"ఔన్లే లోపల జరిగే తంతు మనకెలా తెలుస్తుంది. పోయిన సంవత్సరం ఇలాగే నెలనెలా లక్షల లక్షలు నష్టం వస్తుందన్నారు"

"ఐతే రాలేదేమిటి!"

"భలే. ఎకౌంట్సులో ఎన్ని అంకెలు మార్చినా చివరికి కొద్ది వేలేనా లాభం కనపడక మానింది కాదు."

అవును. మన రోజులు ఎప్పుడూ బాగుండవు. ధర్మారావు ఈసారి లోలోపల అనుకున్నాడు. అనుకుని నాలిక కొరుక్కున్నాడు.

" నీకు అసలు సమస్య అర్థం కాలేదు" నాయర్.

నిజమే. తనకంటే తక్కువే చదువుకున్నా నాయర్‌కి జీవితం లోతుపాతులు బాగా తెలుసును. నాయర్ జీవితంలో ఎన్నో తుపానుల్ని చూసినవాడు. ఐనా తను సమస్యల్ని అర్థం చేసుకోడానికి ఇతరుల ఉద్దేశ్యాలు వినడానికి తగిన సమయం రాలేదెప్పుడూ. నిన్నమొన్నటి దాకా తను ఆలోచించాల్సిన అవసరం కూడా కలగలేదు. నిజానికి ఇంకా ధర్మారావు జీవితంలో తుపాను ప్రారంభం కాలేదు జీవితంలో చిన్నచిన్న విషయాలకే హడలిపోవడం తప్ప. అసలు కొద్దిపాటి వాటికే పరితపించడం తప్ప, తుపాను వీచేముందు ముసురుకునే చల్లటిగాలి, నిరాశ, నిస్పృహలు తప్ప, నిజానికి ధర్మారావు జీవితంలో ఇంకా తుపాను ప్రారంభమే కాలేదు.

"మనిషిని క్రమేపి చంపడం వాళ్ళకి బాగా తెలుసును."

" ఐతే మనరోజులు బాగుండేదెప్పుడు?" నాయరు.

అసలు మన రోజులు ఎందుకని బాగోలేవు?

ఏ మనిషీ సుఖంగా బ్రతుకుతున్నట్టు అవుపించడు ఎందుకని. ఒక్క లాలాజీ తప్ప ఈ

గదిలో ఆఖరికి నాయర్ స్థితి కూడా చెడింది. ఎందుకని. ఈసారి నాయర్‌కీ తనకీ ఎక్కడో చాలా దగ్గిర సంబంధం ఉందనిపించింది. ఔను. తనకి తెలుస్తున్నది ఇప్పుడు. తను ఒకడే కాదు. తనలాటి వాళ్ళు లక్షోపలక్షలు. అందరిలో తనూ ఒకడు. తనకి తెలుస్తున్నది ఇవాళ. ఇది తన ఒక్కడి సమస్యే కాదు. లక్షోపలక్షలకి సమస్య. తన ఒక్కడికీ సంబంధించినది కాదు. అందరిలో తనూ ఒకడు.

నాయర్ అంటున్నాడు ; "ఇంక రెండు రోజుల్లో కాకా మన పెట్టెలు వీధిలో పారేస్తాడు."

మాటలు శాపాల్లాంటివి. పదునైన బల్లాలాంటివి.

"లాలాజీ ఇంకా రాలేదేం" ధర్మారావు నాయరు చెప్పే మాటలు వినిపించుకోకుండా తనలో తను గొణుక్కుంటున్నాడు.

బైట పొగమంచు ధవళ వస్త్రాలు ధరించుకున్న మనుషులకి మల్లే రోడ్డు మీద అటూ ఇటూ పచార్లు చేస్తున్నది. మబ్బుల్లోంచి గాలిలోంచి రోడ్డుమీదకి, కిటికీ ఊచల్లోంచి గదిలోకి దిగి వస్తున్నది. వెన్నెలకాంతిలో పచ్చగా నల్లగా మెరుస్తున్న కిటికీ ఊచలు తప్ప గదినిండా చీకటి తేమగా పరుచుకుని వుంది. అరలరలుగా వున్న ఈ భవనం గదుల్లో పదిగంటలకే లైట్లు ఆర్పేస్తారు. నువ్వు స్విచ్చీ వెయ్యనక్కర్లేదు. ఏడుగంటలకి వెలుగుతాయి. పదింటికి ఆరిపోతాయి. అసలు ఏ గదిలోనూ స్విచ్చీలు లేవనే విషయం నువ్వు గమనించి వుండకపోవచ్చు.

"ఈ ఇళ్ళమీద కాకా ఎంత సంపాయిస్తున్నాడో నీకు తెలుసా." నాయరు చెప్పుకుపోతున్నాడు.

"రెండు లక్షలు పన్ను కడుతున్నాట్ట"

నిజానికి నాయర్‌కి కూడా తెలియకపోవచ్చు!

ధర్మారావు ముఖం పక్కకి తిప్పుకున్నాడు. నాయర్‌తో మాట్లాడ్డమంటే తనకి మొదటినుంచీ విసుగు. జీవితంలో వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కోవటమంటే తల బొప్పికడితేనే తప్ప ఎవరికైనా కష్టమే మరి. పైగా తను జీవితంలో ఇంతచిన్న వయస్సులో వన్యమృగంలాంటి పరిస్థితుల్ని మూర్ఖంగా ఎదుర్కోవడం తటస్థించింది. నిజమే. నాయర్ చెప్పినవన్నీ నిజమే. 'ఐతే ఈ నాల్గువందల ఎనభై సంసారాలు కుళ్ళి కృశించి నశించాల్సిందేనా?' ధర్మారావుకి ప్రశ్న చట్టున ముఖాన కొట్టినట్టనిపించింది. ఇంత కిరాతకత్వం ఎక్కడ వుంది. అసలు లోపం ఎక్కడ వుంది.

నాయర్ అంటాడు ఇవన్నీ వ్యాధి లక్షణాలు మాత్రమేనని.

ఉద్యోగం కోసం ప్రయత్నించి విసిగెత్తి నిరాశచెంది, తనకి మాత్రం రైల్లో గుంపులో ఫుట్‌బోర్డు మీద నిలబడి ప్రయాణం చేస్తున్నప్పుడు తనకిమాత్రం ఎన్నిసార్లు ఉద్దేశం కలగలేదు. క్షణంలో తేలిగ్గా జీవితాన్ని అంతమొందించుకుందామని తనకి మాత్రం ఎన్నిసార్లు అనిపించలేదు.

వన్యమృగంవలె జీవితాన్ని పరిస్థితులు ఎదుర్కొన్నప్పుడు గాజుగ్లాసులా తనుకూడా ఈ భూమ్మీద నిలబడదామనే ఆశలు బ్రద్దలైనప్పుడు తనకీ తెలిసి వస్తున్నది, తను జీవితాన్ని ఎంత గాఢంగా ప్రేమించింది.

ఉద్యోగం దొరికే ఆశలు రోజురోజుకీ సన్నగిలేకొద్దీ తనకీ తెలిసివస్తున్నది. క్షణం క్షణం కల్లోలపడుతున్న మానవుడి స్థితి, క్షణక్షణం గగ్గోలు పడుతున్న కుటుంబాల క్షోభ. తన స్థితీ అటువంటిదే. తనూ నిస్సహాయుడే. ఇలా ఆలోచించేప్పుడు ధర్మారావు కళ్ళల్లో నీళ్ళు తిరిగేవి. అధైర్యపడి లాభం ఏమిటి . తను, జీవితాన్ని ఇంత గాఢంగా కాంక్షిస్తున్నవాడు అధైర్యపడి లాభం

ఏమిటి. తనూ ఏదో ఒకటి చేయాలి. బలీయమైన కోర్కె, ఉబలాటం. తనూ సుఖంగా మానవుడిలా బ్రతకాలి. ఆశ ఆర్భాటం. ఐతే తను చెయ్యదల్చుకున్నవి చెయ్యడానికి వీల్లేకుండా చేస్తున్నదెవరు?

3

గుమ్మంలో పెద్దగా ముసిముసినవ్వులు నవ్వుకుంటున్న గర్వంతో వెండిలా మెరుస్తున్న లాలాజీ తల అవుపిస్తున్నది. లాలాజీ చాలా చిత్రమైన మనిషి. ఎప్పుడూ కులాసాగా కాలక్షేపం చేయడం, ఎప్పుడూ నవ్వుతూ ఎదురవడం లాలాజీ ప్రత్యేకత. జేగురు కాంతిలాంటి లాలాజీ నవ్వు ప్రమాదకరమైందని ధర్మారావుకి తెలుసు.

"ఎవరక్కడ?" తను.

ధర్మారావు దుస్థితి కీడుమూడిన మానవుడి స్థితి. లాలాజీకి బాగా అనుభవ వేద్యం.

"హలో. ఎలావుంది జీవితం" లోనికి వస్తూ లాలాజీ ప్రశ్నించాడు. ప్రశ్న ధర్మారావులో అణువణువు భేదిస్తున్నది.

"ఏమిటి కథ?" తను.

"స్టేషన్‌కి వెడదామా?"

"ఎందుకు"

"చాయ్ తాగుదాం"

ధర్మారావుకి ప్రాణాలు లేచి వచ్చాయి.

"పద"

చాయ్ తాగుతూ అడిగాడతను.

"నువ్వు స్టాక్ బ్రోకర్‌వి కదూ"

"భలే. ఎవరన్నారు."

"ఐతే నువ్వు ఏంచేస్తుంటావో ఎప్పుడూ చెప్పావుగాదు."

"ఎప్పుడో నువ్వు నన్ను అడిగినట్టు."

ధర్మారావు మనస్సు నొచ్చుకున్నాడు. ఇన్నాళ్ళూ లాలాజీని తప్పించుకు తిరగడం తనకి అప్పుడే తెలిసివచ్చినట్టు.

"నేను లేనప్పుడు మీరంతా నన్ను గురించి చాలా చాలా చెప్పుకుంటారనుకుంటాను."

మాటలు పొడుస్తున్నవి. తనకి చాయ్ మింగుడు పడలేదు. డబ్బులు ఇచ్చేది లాలాజీ అనే సంగతి తన తలకొట్టేసి నట్లనిపించింది. పెద్ద అవస్థలో పడ్డాడు తను.

"అవును. ఇది అతనీవంతు." లోలో గొణుక్కున్నాడు.

ఐతే తను చేసింది అంత మంచిపని కాదు. ఇన్నాళ్ళూ తనూ ఇతర్లూ లాలాజీని ఆడిపోసుకోడం చూస్తే ఇపుడు తన మీద తనకే అసహ్యం వేస్తున్నది.

"పరనిందలో ఆనందం ఎందుకు?" తనలో తను.

"నన్ను గురించి ఇతర్లు ఏమనుకుంటారోనని నేనెప్పుడూ ఆలోచించలేదు."

ఇందులో అంత నిజం లేకపోవచ్చు.

"ఐతే నేను చేస్తున్నది అంత మంచి పనని నేనుమాత్రం అనుకుంటున్నానా ఏమిటి." లాలాజీ మాటలు చాలా వింతగా వున్నాయి తనకి.

ఐతే లాలాజీ చేస్తున్నది ఏం పని. తను అడగలేదు. మాట పెకల్లేదు.

"ఏదో ఒక రకంగా మనిషి బ్రతకాలా మరి."

"ఔను. ఏదో ఒకటి చెయ్యాలి" తను.

"లేకపోతే ఎన్నాళ్ళని పస్తులుంటావు. ఎన్నాళ్ళని యాతన పడతావు. నేను గోవా నుంచి వ్యాపారం చేస్తాను."

"అలాగా"

అలా చేయడం తప్పుకాదూ.

ఒక పక్కన కడుపుకాలి చస్తుంటే ధర్మపన్నాలేమిటి!

ధర్మారావుకి ఆశ్చర్యం కలిగింది. అయితే గోవాలో సరుకులు కొని దొంగతనంగా బొంబాయి చేరవేస్తాడన్నమాట. చాలా లాభసాటి బేరమేననుకో. ఐతేనేం. చాలా ప్రమాదం కూడా.

ధర్మారావు తనకివేమీ అర్థంకానట్టు ముఖం పెట్టాడు.

"దాదర్‌లో ఆ పచ్చమేడ వుంది చూశావా?"

"ఊ!"

"వాడు అంత పెద్దమేడ ఎలా కట్టాడో తెలుసా"

వంచకుడు. చార్‌సౌబీస్!

"ఇందులోనే?" ఏదో ఒక రకంగా బ్రతకాలి మరి.

"నువ్వు మూడునెల్ల నుంచి ప్రయత్నిస్తున్నా ఇంతవరకు ఉద్యోగం దొరకలేదు. ఔనా?"

'ఇక్కడ నీకోసం ఉద్యోగాలు పోసుకొని కూచోలేదు ఎవరూ' ఏ ఆఫీసులోనో ఏ మేనేజరో తనని అన్న మాటలు.

"ఔను. ఇంక దొరికే ఆశగూడా లేదు."

"నేను ఒకప్పుడు నీలా ప్రతి కంపెనీ చుట్టూ తిరిగిన వాణ్నే ; నేను మీ అందరికంటే ఎక్కువ కష్టాలే పడ్డాను. నా జీవితంలో దాదర్ నుంచి చర్చిగేటు దాకా నడచిన రోజులున్నాయి." దాదాపు పదిమైళ్ళు.

"ఇప్పుడు నా జీవితం హాయిగా గడుస్తున్నది" ఐనా ఇంతకంటే నీచం ఏముంది!

గదికి వచ్చేసరికి నాయర్ లేడు. ఊరేగింపులో పాల్గొనడానికి తెల్లవారక ముందే వెళ్ళిపోయాడు.

"రేపు వెళ్దాం. వస్తావా"

"ఎక్కడికి"

"గోవా"

"ఎందుకు"

"భలే"

"ఆలోచిస్తాను"

"నా దగ్గిర ఉందిలే డబ్బు"

"నన్ను ఆలోచించుకోనివ్వు"

ధర్మారావు ముఖాన నెత్తురుచుక్క లేదు.

జీవితం విలువిద్య లాంటిది.

లాలాజీతో సంభాషణ తన గుండెలు నమిలివేస్తున్నది.

4

ఉదయం అవడంతోనే వేటకి బైల్దేరాడు ధర్మారావు. ఉద్యోగం చేసే యాత్రకి! మరి ఉద్యోగం గండపెండేరం లాంటిది. భద్రత జటాయువు లాంటిది.

తనకి తెలుసు, తను తీగెమీద నడుస్తున్నాడని. ఐతే మధ్యలో ఈ తీగెని తెగగొట్టిందెవరు. తనకి తెలుసు; తను తీగమీద నడవడంలేదని. ఒట్టినే ఇది కత్తి అంచున ఆటగత్తె సామ్యం అని. ఐతే మధ్యలో ఈ తీగెని సృష్టించిందెవరు. ఈ తీగెపైకి ఎక్కించి బలవంతాన తనని కిందకి పడత్రోసిందెవరు. ఎవరు ? ఎవరు ?

తనకి తెలుసు ధ్వనినుంచి ప్రతిధ్వని వస్తుందని. కొంతకాలం తీసుకుంటుందని. ఆడుతూ పాడుతూ పనిపాటలు చేయాల్సిన మానవుణ్ణి - పడి నడచివస్తున్న మానవుణ్ణి శవాలకిమల్లే మృగాలకి మల్లే శ్వాస లాక్కుంటూ – ఇలా మనిషిని మనిషిగా బ్రతకనీకుండా చేస్తున్నదెవరు ?

ధర్మారావుని పిచ్చివాళ్ళ ఆసుపత్రిలో కూచోబెట్టారు. అతని ఒంటినిండా ఉచ్చులు బిగిస్తున్నారు. అతని మనస్సుని శల్యాలుగా లాగివేస్తున్నారు. అందమైన బొంబాయి నగరం అతని మనస్సుకి గుర్రపునాడాలు గుచ్చుతున్నది. తన కాళ్ళకింద చాప లాగుతున్నదెవరు ? తను భీతావహం చెందుతున్నాడు. క్షణక్షణం కంపించిపోతున్నాడు.

అన్నివీధుల్లో తను సంచరిస్తున్నాడు. అన్నివేళల్లో తను అవిరామంగా అరుంధతీ నక్షత్రానికి మల్లే అమావాస్యచంద్రునికి మల్లే అన్ని ఆఫీసుల ముందు తను ప్రకాశిస్తున్నాడు.

కుత్సితాలకి కుట్రలకి ఆలవాలమైన సమాజంలో కూచున్నాడు. మధ్యాహ్నం సూర్యుడు కాళ్ళూ చేతులూ ముఖమూ చెవులూ కాలుస్తున్నాడు. విరిగిపోయిన పాలకిమల్లే నల్లమందు మిథ్యావాదంలో పడలేదు తను. తనచుట్టూ నిరాశావృత్తం చుట్టుకుని తిరగడంలేదు తను.

నివ్వెరపడి, తల దిమ్మెత్తి, కాళ్ళు పడిపోయి, ఒళ్ళు చల్లబడి శ్వాసాడక కొట్టుకులాడుతున్న సమాజంలో, అస్థిపంజరం లాంటి కుక్కగొడుగుల్లాంటి పార్కులాంటి సమాజంలో కూచున్నాడు.

గతంలో పడిపోయినవాళ్ళు, ప్రస్తుతంలో పనికిరానివాళ్ళు, భవిష్యత్తులో పడిగాపులు పడేవాళ్ళు, అందరూ కలిసేచోట, నీటిలో చేపలవలె దూసుకుపోయే భయాలు కలిగేచోట, పార్కులో సమాధిలాంటి సమాజంలో కూచున్నాడు తను.

దేవుడా, ఏమిటి ఇలా చేశావు.

వినరానిచోట్ల వింటూ, తిరగరాని చోట్ల తింటూ పడరాని పాట్లు పడుతున్నాడు. కాళ్ళూ చేతులూ తనవి కానట్టు తనతో సంబంధం లేనట్టు, చెక్కవి తగిలించుకున్నట్టు వేటికవే ఊడిపడుతున్నాయి. బ్రతుకు జీవుడా అని బలుసాకైనా లేక ఒట్టినే గాలికి తిరుగుతున్నాడు తను.

అవును. సామాన్య మానవుడి దుస్థితికి కారణాలుః ధరలూ, వ్యాధులూ, గాలి. అవును ధనికులు కూడా. అన్నిటికంటే ధనికులు కూడా. తనకి తెలుసు. సముద్రం ఉప్పొంగి వస్తుందని,

సంఘటిత పడుతున్న లక్షోపలక్షల యువకులు, కోటానుకోట్ల మానవులు సముద్రంలా ఉప్పొంగి వస్తారని, తనకి విశ్వాసం మెండు. మానవుడిలో పోరాటంలో ధర్మంలో తనకి విశ్వాసం మెండు.

అందుకే యింకా తను ప్రకాశిస్తున్నాడు.

అందుకే తను జీవితాన్ని ఇంకా గాఢంగా ప్రేమిస్తున్నాడు.

అందుకే ఇంకా ప్రతి ఆఫీసు ముందూ విరూపాక్షునిలా బాధా సముద్రునిలా బడబాగ్నిలా ఇంకా తను ప్రకాశిస్తున్నాడు.

తనని వేలకి వేల ప్రశ్నలు వేధిస్తున్నాయి. జవాబులివ్వని ప్రశ్నలు, ప్రశ్నలు వేయని జవాబులు, అన్నీ తనని లక్షోపలక్షలుగా పీడిస్తున్నాయి. ఐతే తను చావడానికి ఒప్పుకోడం లేదు. మరి బ్రతికి బాగుపడాలని తనకివుంది మరి. తను జీవితాన్ని గాఢంగా నిశ్శంకగా ప్రేమించాడు మరి. ఐతే ఇప్పుడు తను చెయ్యాల్సిందేమిటి ? ఇప్పుడు తనేం చెయ్యాలి ?

తను అనుకున్నట్టు జరుగుతవనుకున్న విషయాలకి జరగరాని పరిస్థితుల్లో జరుగుతున్న విషయాలకి – ఒకదానికొకటి పోల్చి చూసుకుంటున్నాడు. రెండు చేతులు కలిపి వేళ్ళు గుణించుకుంటున్నాడు. ఎక్కడతేడా వస్తున్నది. అసలు విషయం ఏమిటి. అసలు మానవుడికి మానవుడికీ ఇంతభేదం ఎక్కడ కల్పితమైంది. అసలు వీటన్నిటికీ కారణం ఏమిటి ?

భారతి, మే 1953.